క్లుప్తంగా

టీచర్లను బదిలీ చేయొద్దని ఆందోళన



టీచర్లను బదిలీ చేయొద్దంటూ ఆందోళన చేస్తున్న విద్యార్థులు

కుందుర్పి: మండలంలోని కెంచంపల్లి ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు టీచర్లను బదిలీ చేయొద్దని డిమాండ్ చేస్తూ విద్యార్థులు పాఠశాల వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. పాఠశాలలో మొత్తం 98 మంది విద్యార్థులకు ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే సర్దుబాటులో భాగంగా ముగ్గురు టీచర్లను వేరే ప్రాంతానికి బదిలీ చేశారు. టీచర్లను బదిలీ చేయవద్దని సుమారు గంట పాటు విద్యార్థులు ఆందోళనకు దిగారు.

సీఎన్సీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 30 నుంచి కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ (సీఎన్సీ) ప్రోగ్రామింగ్ అనే కొత్త కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కోర్సులో చేరేందుకు ఐటీఐ, ఇంటర్మీడియెట్, డిప్లమో, బీటెక్ చదివిన విద్యార్థులు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఏపీ స్టేట్ టెక్నికల్ బోర్డు నుంచి సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుకు రూ.1,500 ఫీజు ఉంటుందని, ఇతర వివరాలకోసం సెల్: 9898400832లో సంప్రదించాలన్నారు.

చీకలగురికిలో పొలంబడి



చీకలగురికిలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ పెన్నయ్య, తదితరులు

విడపనకల్లు: మండలంలోని చీకలగురికిలో ఏఓ పెన్నయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పొలంబడి నిర్వహించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన కంది,వేరుశనగ, ఇతర పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్య క్రమంలో వీఏఏ లక్ష్మణ్,రైతులు శంకరయ్య, మునెమ్మ, చంద్ర, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపాల్ తీరు మారాలి



గురుకుల పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు

కంబదూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తీరు మారాలని ఎస్సీ,ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షుడు రమేష్ అన్నారు. శుక్రవారం పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఆందోళనకు ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘం నాయకులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలను విద్యార్థులు బయటకు చెప్పుకోలేక అవస్థలు పడుతున్నారన్నారు. పాఠశాలలో పని చేసే సిబ్బందిని కూడా వేధిస్తుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

టంగుటూరి సేవలు చిరస్మరణీయం



ఉరవకొండలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినులు

కళ్యాణదుర్గం: టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయమని ప్రధానోపాధ్యాయులు సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో ఆంధ్ర కేశరి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు టంగుటూరి ప్రకాశం పంతులు జీవిత విశేషాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరసింహులు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కుళ్లాయమ్మ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతుల జయంతి

కంబదూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయుర్వేదిక్ వైద్యాధికారి రాధాకుమారి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కఠిన శిక్షలు అమలు చేయాలి

ప్రభుత్వం విధుల్లో ఉండే వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం చేయడం దుర్మార్గం. దోషులను కఠినంగా శిక్షించాలి. సమాజంలో ఎన్నో మారాయిగానీ మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయి. సమాజంలో మనషులు నైతిక విలువలతో జీవించడం నేర్చుకోవాలి. హత్యాచారం చేసిన వారికి కఠినమైన శిక్షలు అమలు చేయాలి.

– డాక్టర్ రిహాజైనం, కళ్యాణదుర్గం



వైద్య సిబ్బందికి రక్షణ అవసరం

కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, ఆపై హత్య ఘటన యావత్ దేశాన్నే కలిచివేసింది. ప్రాణాలు కాపాడే వైద్యుల పట్ల మృగాల్లా వ్యవహరించడం సరికాదు. రాత్రివేళల్లో డ్యూటీ చేసే వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. పగటిపూటలాగే రాత్రివేళల్లో కూడా పోలీసులు, సెక్యూరిటీ గార్డులను అందుబాటులో ఉంచాలి. ఆస్పత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత కల్పించాలి.

– ప్రదీప్‌తీ, వైద్యాధికారిణి, రాయదుర్గం ఏరియా ఆస్పత్రి



నిండా మునిగిన రైతులు

కణేకల్లు: భారీ వర్షాలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. పంటలు బాగున్నాయని ఆనందపడుతున్న సమ యంలో కంటతడి పెట్టించాయి. కణేకల్లు మండలంలో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గరుడచేడు గ్రామంలో నారాయణరెడ్డికి చెందిన 2 ఎకరాలు, మల్లప్పకు చెందిన 3 ఎకరాలు, వెంకట్రామిరెడ్డికి చెందిన 3 ఎకరాలు, దాసరి హనుమంతప్పకు చెందిన 2.5 ఎకరాలు, లాలెప్పగారి లక్ష్మీకి చెందిన 5 ఎకరాలు, కొట్రేష్‌కు చెందిన 2.5 ఎకరాలు, గంగాధర్‌గౌడ్‌కు చెందిన 2 ఎకరాల వేరుశనగ పంట తుడిచిపెట్టుకు పోయింది. గరుడచేడు, మీన్లహళ్లి గ్రామంలోనే 650 ఎకరాల్లో వేరుశనగ పంట దెబ్బతింది. లింగారెడ్డి, కాపు ఈరన్నగౌడ్, మహాదేవన్న గౌడ్‌తోపాటు సుమారు 150 మంది రైతుల పొలాలు ముంపునకు గురయ్యాయి. తుంబిగనూరులో ఆనంద్, తిప్పయ్య, గౌరమ్మ, ప్రభాకర్‌గౌడ్‌కు చెందిన వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. 90 మందికి చెందిన 310 ఎకరాల వేరుశనగ పంటలు దెబ్బతిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. సజ్జ, పత్తి పంట సాగు చేసిన రైతులు కూడా నష్టపోయారు. 67 మంది రైతులకు సంబంధించిన సజ్జ పంట 190 ఎకరాల్లో, పత్తి పంట 25 ఎకరాల్లో దెబ్బతింది. కె.కొత్తపల్లి, పులచెర్ల గ్రామంలో సుమారు 70 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పంటల నష్టంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు.

కన్నీరే మిగిలింది



భారీ వర్షాలు వేరుశనగ పంటను తీవ్రంగా దెబ్బతీశాయి. 5 ఎకరాల్లో సాగు చేసిన వేరుశనగ పంట మొత్తం తుడిచిపెట్టుకొని పోయింది. భారీ వర్షాలు మాకు కన్నీరు మిగిల్చాయి. అప్పులు చేసి పంట పెట్టుబడులు పెట్టా. భారీ వర్షంతో పంట మొత్తం సర్వనాశనం కావడంతో అప్పులెలా తీర్చాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారమిచ్చి ఆదుకోవాలి.

– లాలెప్ప గారి లక్ష్మీ, గరుడచేడు



తుంబిగనూరులో చెరువును తలపిస్తున్న సజ్జ పంట



మేతయినా మిగులుతుందని పంట తొలగిస్తున్న దాసరి హనుమంతప్ప





గరుడచేడులో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

దోషులను కఠినంగా శిక్షించాలి



బొమ్మనహాళ్‌లో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది



ఉరవకొండలోని కవితా హోటల్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థినులు

కూడేరు: కోల్‌కతా ఘటనలో దోషులను శిక్షించాలని మండల వైద్యాధికారులు లక్ష్మీనారాయణ, సౌమ్యారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కూడేరులోని పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రవీంద్ర, యశోద, ల్యాబ్ టెక్నీషియన్ వేణుగోపాల్, ఫార్మసిస్ట్ వేణుగోపాల్ , ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

బొమ్మనహాళ్: కోల్‌కతా ఆర్‌జీకర్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని వైద్యాధికారిణి మల్లేశ్వరి, కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్‌లో జూనియర్ కళాశాల విద్యార్థులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థినుల నిరసన ప్రదర్శన

ఉరవకొండ: దేశంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, ఉద్యోగినులకు రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆర్డీటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ, మానవహారం ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి విద్యార్థినులు, ఉద్యోగినులు, ఆర్డీటీ ఉద్యోగులు ర్యాలీ చేశారు. అనంతరం కవితా హోటల్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఆర్డీటీ ఏటీఎల్ నల్లప్పరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మమత మాట్లాడుతూ కోల్‌కోతాలో వైద్యురాలిపై హత్యాచారం చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

• డీసీహెచ్ పాల్ రవికుమార్



ఆస్పత్రిలో విచారణ చేస్తున్న డీసీహెచ్ పాల్‌రవికుమార్

రాయదుర్గం: ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, మెరుగైన సేవలు అందించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీసీహెచ్ఎస్ పాల్ రవి కుమార్ హెచ్చరించారు. శుక్రవారం రాయదుర్గం ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాల్లోని వార్డులు, వసతులు, రోగుల ఇబ్బందుల పై అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది విధుల్లో ఉన్న సెక్యూరిటీ రవికుమార్‌తో రోగికి మబ్లేజర్ ఎందుకు పెట్టించాల్సి వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వ జీతం తీసుకొని ప్రైవేటుగా వైద్యం చేయడం సరైన పద్ధతికాదని డీసీహెచ్ఎస్ మండిపడ్డారు. ఉదయం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు విధుల్లో ఉండాలన్నారు. 2018 నుంచి బర్త్ అండ్ డెత్ డేటా అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని ఓఅడ్వకేట్ డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదు చేశారు. ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరికి నిరసనగా విద్యార్థి సంఘాల నా యకులు ధర్నా చేశారు. విచారించి చర్యలు తీసుకుంటామని డీసీహెచ్ఎస్ హామీ ఇచ్చారు. మెడికల్, అడ్మినిస్ట్రేటివ్, నర్సింగ్ సూపరింటెండెంట్లు మాధవి, మహబూబ్‌బాషా, పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంఈఓకు గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం ఎంఈఓ విజయ్ కుమారికి రోడ్డుప్రమాదంలో గాయాలయ్యాయి. వివరాలు.. అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి కారులో కంబదూరు ఎంఈఓ మదన్, కళ్యాణదుర్గం ఎంఈఓ విజయ్ కుమారి వెళ్తున్నారు. వీరు ప్రయాణిస్తున్న కారు గోళ్ల గ్రామం వద్ద మట్టిదిమ్మను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కళ్యాణదుర్గం ఎంఈఓ విజయ్‌కుమారి స్వల్పంగా గాయపడ్డారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

బాలుర హాస్టల్‌లో వైద్యశిబిరం

కూడేరు: మండల కేంద్రంలోని బాలుర వసతుల గృహంలో శుక్రవారం హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వైద్యాధికారి లక్ష్మీనారాయణ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డెన్ గురు ప్రసాద్ , సూపర్ వైజర్లు రవీంద్ర, యశోద, ఏఎన్ఎం చంద్రకళ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా శివలింగ విగ్రహ ప్రతిష్ట

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరులో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో శివలింగ విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విశిష్ట పూజలు చేసి శివలింగాన్ని, ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి ప్రతిష్టాపనలో పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామాంజినేయులు, నాయకులు చెన్నకేశవరెడ్డి, మురళి, అనంద్‌రెడ్డి, అనీల్‌రెడ్డి, చిన్న సిద్దప్ప, రామకృష్ణ, నాగరాజు, శరణవసవ, నుంకేష్ పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకుంటున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

'ఉపాధి' పనులు సద్వినియోగం చేసుకోవాలి

ఉరవకొండ /కూడేరు/వజ్రకరూరు/బ్రహ్మసముద్రం /బెళుగుప్ప/కంబదూరు/గుమ్మఘట్ట/శెట్టూరు/విడపనకల్లు: ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ప్రత్యేకాధికారిణి కుష్బూకొఠారి తెలిపారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. సర్పంచు మీనుగ లలితమ్మ, ఎంపీపీ నరసింహులు, ఈఓఆర్‌డీ చంద్రమౌళి, గ్రామ కార్యదర్శి గౌస్‌సాహెబ్ పాల్గొన్నారు. కూడేరు మండలంలో స్పెషలాఫీసర్ శ్రీని వాసు లురెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ చౌదరి శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఏపీఓ తులసీప్రసాద్, అధికారులు పాల్గొన్నారు. **వజ్రకరూరు** మండలంలో గ్రామసభలు నిర్వహించారు. కొనకొండ్లలో గ్రామసభ అర్ధంతరంగా ముగిసింది. సర్పంచు నంచర్ల ఇందిరమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య,ముద్దయ్య, ఈఓఆర్డీసదాశివ, కార్యదర్శి శ్రీధర్‌రావు హాజరయ్యారు. **బ్రహ్మసముద్రం** మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. ఈఓఆర్డీ వెంకట నాయుడు, పంచాయతీ కార్యదర్శి మురళి, సర్పంచ్ పూజ, జెడ్పీటీసీ ప్రభావతి, ఎంపీటీసీ నాగలక్ష్మీ పాల్గొన్నారు. **బెళుగుప్ప** మండలంలో గ్రామసభలు నిర్వహించారు. ప్రత్యేకాధికారి శ్రీషేక్ షఫీ, సర్పంచులు సాలిబాయి,రామిరెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, డీటీ హుసేన్‌పీరా పాల్గొన్నారు. **కంబదూరు** మండలంలో గ్రామ సభలను నిర్వహించా రు. జడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ తిమ్మరాజ మ్మ, ఎంపీడీఓ సాల్మన్,సర్పంచ్‌లు పద్మావతమ్మ పా ల్గొన్నారు. **గుమ్మఘట్ట మండలంలో** గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఏపీఓ సురేశ్ పాల్గొన్నారు. **శెట్టూరు** మండలంలో గ్రామసభలు నిర్వహించారు. ఐదుకల్లులో టీడీపీ నాయకుల మధ్య యానిమేటర్ నియామకం కోసం గొడవ జరిగింది. సర్పంచులు ,ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, ఏపీడీ రమేష్ నాయక్ పాల్గొన్నారు. **విడపనకల్లు** మండల వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు,ఏఎస్ఓ పర్వతప్పపాల్గొన్నారు.

గురుకులం క్యాంపస్‌లో అపరిశుభ్రత






గురుకుల పాఠశాల లోపల నిలిచి ఉండడంతో నెలకొన్న అపరిశుభ్రత

కణేకల్లు: కణేకల్లుక్రాస్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్యాంపస్‌లో మురుగునీరు నిలిచి ఉండడంతో అపరిశుభ్రత నెలకొంది. ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వర్షం నీటితోపాటు మురుగునీటితో క్యాంపెస్‌లో ఉన్న డ్రైనేజీలు నిండిపోయాయి. ఐదారు రోజుల నుంచి మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసనతోపాటు దోమల వ్యాప్తితో చాలా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల ముఖద్వారం వద్ద కూడా మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోందని విద్యార్థులు తెలిపారు. క్యాంపస్ లోపల, ముఖద్వారం వద్ద కూడా చెత్తచెదారంతో అపరిశుభ్రత నెలకొందన్నారు. పిల్లలకు రోగాలు రాకముందే శానిటేషన్ పనులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



విద్యార్థినులతో జేవీవీ నాయకులు, ఉపాధ్యాయులు

ఉరవకొండ: విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్ తెలిపారు. శుక్రవారం ఉరవకొండలోని బీఆర్ అంబేడ్కర్ బాలికల ఎస్సీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు జేవీవీ ఆధ్వర్యంలో బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ సునీత అధ్యక్షతన సమా వేశం జరిగింది. అనంతరం ఆగస్టు 15న స్వాతంత్ర్య సమరయోధులు అనే అంశంపై జేవీవీ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షురాలు ధరణి పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

శెట్టూరు: చింతర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ శ్రీధర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వహణ, నాణ్యతను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న గ్రుడ్లు, చిక్కీ, రాగిజావపై ఆరాతీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ జరిగిన పాఠ్యాంశాలను తెలుసుకున్నారు.

పాఠశాలల వేళకు బస్సులు నడపాలి

ఉరవకొండ: ఉరవకొండ ఆర్టీసీ డిపో పరిధిలో గ్రామీణ ప్రాంతాల నుంచి కళాశాలలు, పాఠశాలలకు వచ్చే విద్యార్థుల కోసం సమయానికి ఆర్టీసీ బస్సులు నడపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్దార్థ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉరవకొండలో ఆయన మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు సిద్దార్థ్ మాట్లాడుతూ ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాకు చెందిన గ్రామీణ ప్రాంత విద్యార్థులు సమయానికి బస్సులు లేకపోవడంతో కళాశాలలు, పాఠశాలలకు ఆటోల్లో రావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

కండీషన్‌లేని బస్సులు నడుపుతున్నారని ఫిర్యాదు

రాయదుర్గంటౌన్: రవాణాశాఖ నిబంధనలను పాటించకుండా కండీషన్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారని సీపీఎం నాయకులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున రవాణాశాఖ అధికారికి వినతిపత్రం అందించారు. ప్రైవేటు పాఠశాలల యజమానులు రవాణాశాఖ నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపడమే కాకుండా లైసెన్సు ఉన్న డ్రైవర్లను నియమించుకోలేదన్నారు. సీపీఎం నాయకులు మధు, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలంటూ ఆందోళన

రాయదుర్గం(డి హీరేహాళ్): వేతనాలు చెల్లించాలంటూ శ్రీరామరెడ్డి తాగునీటి పథకం వర్కర్లు డీ హీరేహాళ్ మండలం గొడిశెలపల్లిలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. నాలుగు నెలలుగా వేతన బకాయిలు చెల్లించకపోవడంతో పూటగడవడం కష్టంగా ఉందని కార్మికులు ఎర్రిస్వామి, గోవిందరెడ్డి, ఈశ్వర్, చిదానంద, నాగెంద్రరెడ్డి లు ఆవేదన వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతను పాటించాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోటేశ్వరరెడ్డి, సీహెచ్ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బోరుబావుల వద్ద కేబుల్ అపహరణ

బెళుగుప్ప: మండల కేంద్రంలోని లింగన్న, చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటేశులు తదితరులకు చెందిన 15 మంది రైతుల బోరుబావుల వద్ద కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. స్థానిక పోలీసులకు రైతులు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

వేతనాలు ఇవ్వాలని నిరసన

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్లలోని సత్యసాయి మంచినీటి పథకం వద్ద కార్మికులు శుక్రవారం నిరసన తెలియజేశారు. వేతన బకాయిలు చెల్లించాలని నిరవధిక సమ్మె చేశారు. కార్యక్రమంలో సత్యసాయి కార్మికులు జయన్న, భీమేష్, చెన్నయ్య, బాబు, వెంకటాద్రి, యాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్,సుఖవ్యాధులపై అవగాహన

గుమ్మఘట్ట: ప్రస్తుత నవ సమాజంలో మహిళలు, యువతులు ఎయిడ్స్, సుఖవ్యాధులపై అవగాహన అవసరమని పీహెచ్‌సీ వైద్యులు బాలాజీనాయక్,మాస్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ నీలకంఠ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమైఖ్య కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ, మాస్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్, సుఖవ్యాధులపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ మణిమాల, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, రెవెన్యూ సిబ్బంది, వెలుగు సిబ్బంది, మహిళా లీడర్లు పాల్గొన్నారు.